# బాలమిత్ర

ఫిబ్రవరి - 1996





# విశ్వాసం

బాబా సన్నిధానంలో ఒకసారి దసరా ఉత్సవాలు చాలా బాగా జరుగుతున్నాయి. రోజూ భజనలూ, హారతులు, బాబా బోధనల వంటి కార్యక్రమాలతో వైభవంగా జరుగుతున్న ఆ ఉత్సవానికి ఎందరో భక్తులు వచ్చారు.

అప్పుడు బాబా ప్రియశిష్యుడు, ''బాబా, మీకెంతోమంది భక్తులు ఉన్నా, వారందరిలో నేను మీకు ప్రియశిష్యుడినవటం నిజంగా నా అదృష్టం కాదా!'' అన్నాడు.

దానికి బాబా నవ్వి, ''చెట్టునాశ్రయించి ఎన్నో ఫలాలు కాస్తాయి, పూవులు పూస్తాయి, ఆకులు వస్తాయి, మొక్కలు మొలుస్తాయి. కానీ అవి అన్నీ నిలకడగా, స్థిరంగా ఎప్పటికీ ఆ చెట్టుని అంటిపెట్టుకుని ఉండలేవుకదా! ఆఖరికి మిగిలేవి ఏ కొన్నో'' అన్నారు.

అందులోని ఆంతర్యం అతనికి అర్థమవలేదు. అయినా ఊకొట్టాడు.

తర్వాత అందరూ కలిసి బాబాతో సహా ఆఖరి రోజు సంతర్పణలో భోజనానికి కూర్చున్నారు. బాబా ఆ రోజు తమ అందరితోపాటు, తమందరి మధ్యా భోజనానికి కూర్చోవటం చూసి భక్తులు చాలామంది ఆశ్చర్యపోయారు.

కాస్సేపటికి భూమి కంపించింది. భక్తులందరూ తాము కూర్చున్న పెంకుటిల్లు కూలి తమమీద ఎక్కడ పడుతుందోనన్న భయంతో, తింటున్న అన్నాలు, విస్తళ్ళు వదిలి బయటికి పారిపోయారు. ఓ పదిమంది మాత్రం బాబా చుట్టూచేరి కూర్చున్నారు. అప్పటికే బాబా- ''ఆగు... ఏమిటా కంగారు. సంతర్పణ భోజనాలు చేస్తున్నాము కదా'' అంటూ పై కప్పుకేసి చూసి చెయ్యి అడ్డుపెడ్తూ అన్నారు.

ఆ తర్వాత భోజనాలు ముగిసాయి. సగం తింటూ తింటూ భయంతో బయటకి పారిపోయిన భక్తుల గురించి బాబా బాధపడ్డారు.

''రండి, అలా చెట్టు కింద కూర్చుందాం'' అంటూ ఆ పదిమందినీ తీసుకుని చెట్టు

జి. రామలక్ష్మి, హైదరాబాదు

కిందకు వెళ్తూ... అక్కడికి వెళ్ళగానే- ''ఊ... యింక నీ కర్తవ్యం నీవు కానీ'' అన్నారు ఇంటివైపు చూస్తూ.

భూకంపానికి కదిలిన పెంకుటిల్లు పడబోయి, బాబా ఆజ్ఞతో అలా గాలిలో నిలబడిపోయింది. అనంతరం ఆనతి లభించగానే ధబేలువమంటూ కుప్పకూలిపోయింది. అది చూసి అందరూ ఆశ్చర్యపోయారు.

బయటకు పారిపోయిన భక్తులు ఒక్కొక్కరుగా వచ్చి బాబా పాదాలపైబడి మొక్కుతూ, ''క్షమించండి బాబా, మీ శక్తినీ, మీ మహిమలనూ తెలుసుకోలేక అన్నం వదిలి మరీ పారిపోయాం'' అన్నారు బాధపడుతూ.

దానికి బాబా, ''ప్రాణంపై గల తీపి, ప్రాణ భయం కలిగిస్తుంది. అందునా ఈ బాబా ఉండగా మనకేమిటి భయం, అన్నీ బాబానే చూసుకుంటారు. మనం నిశ్చింతగా ఉండొచ్చు అన్న విశ్వాసం మీలో లేకపోబట్టే పారిపోయారు. అన్నిటికీ మూలం 'విశ్వాసం'. నమ్మకం, భక్తి, అర్పణ, ధ్యాస, ధ్యానం అవి లోపించిన భక్తి భక్తే కాదు. తల్లీ, తండ్రీ, గురువు, దైవం వీటిపై విశ్వాసం చాలా ముఖ్యం. అవి మీలో లేకే పారిపోయారు'' అని అనడంతో అందరూ సిగ్గుతో తలవంచుకున్నారు.

''నా భక్తుల రక్షణ నాది కాదా! నన్నాశ్రయించిన వారిని నేను కాపాడుకోలేనా?'' అంటూ వారిని ఆదరించి, ఓదార్చి, నచ్చచెప్పి పంపించేసారు.

ఆ తర్వాత తన ప్రియశిష్యుడు - మిగిలిన తొమ్మిది మందితోనూ- ''వృక్షం గురించి ఉదాహరణ చెప్పాను కదూ, అలాగే- భగవంతుని చేరిన భక్తులు సైతం కోకొల్లలు వున్నా చివరకు మిగిలేది మాత్రం నిజమైన భక్తి, విశ్వాసం కలిగినవారు ఏ ఒక్కరో యిద్దరో'' అన్నారు నవ్వుతూ.

అప్పుడు అర్థమయింది ఆ చెట్టు ఉదాహరణ, బాబా ఆంతర్యపు మాటలు. బాబా ఏది చేసినా, ఏది చెప్పినా, ఏదో ఒక ఆంతర్యం ఉంటుంది. అందుకే భక్తులు పరిపూర్ణ 'విశ్వాసం' కలగివుండాలి మరి.

